క్లుప్తంగా

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



కొట్టక్కి పెట్రోల్ బంకులో తనిఖీలు చేపడుతున్న రెవెన్యూ అధికారులు

రామభద్రపురం: మండలంలోని పలు పెట్రోల్ బంకుల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం కూడా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ ఆర్. సాయికృష్ణ, ఆర్ఐ భాను ప్రకాశ్, తదితరులు మాట్లాడుతూ.. నాణ్యత, కొలతల్లో తేడాలొస్తే చర్యలు తప్పవన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అల్లు భాస్కరరావు

బొబ్బిలి రూరల్: భద్రత విషయంలో బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు, బంధువులు యువతకు అండగా నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీడీపీఓ విజయలక్ష్మి, వెలుగు ఏపీఎం పీఏ స్వామి, ఎస్సై చదలవాడ సత్యనారాయణ, పిరిడి, పక్కి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఏఎన్ఎస్‌కే జ్యోతి, సీహెచ్ తనూజ, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం



విద్యార్థులకు మందులు అందిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం.సునీల్‌కుమార్ 45 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఆయుర్వేద మందులు వినియోగం వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంపీ ఉదయ్‌భాస్కర్, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహసారథుల శిక్షణ శిబిరం

వంగర: మండలంలోని మద్దువలస గ్రామ సచివాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గృహసారథుల శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ హాజరుకానున్నట్లు చెప్పారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ కరణం రాధమ్మ ఆధ్వర్యంలో జరగనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.


బాల్యవివాహాలు తగవు..

తెర్లాం: బాల్య వివాహలు చేయడం తగదని ఈఓపీఆర్‌డీ ఆర్. రాంబాబు అన్నారు. స్థానిక గౌతమ్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే బాలికలు గుడ్/బ్యాడ్ టచ్‌లను తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం ప్రశాంతి, సచివాలయ మహిళా పోలీసులు తులసీ, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.శ్రీదేవి, సునీత, లక్ష్మి, విజయదుర్గ, కుమారి, పార్వతి, అన్నపూర్ణ, ఆశ వర్కర్లు, గౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

రాజాం: పట్టణంలోని సారధి రోడ్డులో ఉన్న బధిరుల పాఠశాలలో శుక్రవారం అన్నధాన కార్యక్రమం జరిగింది. సంతకవిటి మండలం కొండగూడెం గ్రామానికి చెందిన అక్కరపోతు రేవంత్‌నాయుడు పుట్టినరోజు సందర్భంగా తన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు మిఠాయిలు పంచిపెట్టారు.

85 మందికి ఉద్యోగాలు



ఎంపికైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 85 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు తెలిపారు. హెటిరో, గ్రావిటీ, అరబిందో కంపెనీల ప్రతినిధులు జి.జగదీష్, పి.శివరామ్, ప్రసాద్ సుమారు 120 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, 85 మందిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రాలు అందించారు.

తప్పుడు కథనాలు ఎవరి మెప్పుకోసం..?

- ఈనాడు తప్పుడు వార్తలపై ఎమ్మెల్యే ఆగ్రహం
- పత్రిక ప్రతులను దహనం చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

బొబ్బిలి రూరల్: రామోజీ.. ఈ రోత రాతలేంటి... ఎవరి మెప్పుకోసం ఈ తప్పుడు కథనాలు.. చంద్రబాబు అధికారంలోకి రావడం కల.. జగన్ మోహన్‌రెడ్డిని ప్రజల నుంచి వేరు చేయలేరంటూ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. టీడీపీ నాయకుడు పట్టాభిని పోలీసులు కొట్టారంటూ తప్పుడు వార్తలు ప్రచురించడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసత్య కథనాలు ప్రచురిస్తే పాఠకుల నుంచే ఛీత్కారాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇలా ప్రచురించడం మంచి సంస్కృతి కాదని హితవు పలికారు. జగన్ మోహన్‌రెడ్డిని నేరుగా ఎదుర్కోలేక చంద్రబాబునాయుడు తన అనుకూల మీడియాతో దుష్ప్రచారం చేయిస్తున్నారని.. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా, కుయుక్తులు పన్నినా జగన్‌మోహన్‌రెడ్డే 2024లో సీఎం అవుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు తూముల రామసుధీర్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హమీద్, పలువురు కౌన్సిలర్లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి

- జేసీ మయూర్ అశోక్



ఉత్పత్తులను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

బాడంగి: రైతు జట్టు సంఘం ద్వారా పండిస్తున్న ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించేలా ఎఫ్‌పీసీ (ఫార్మర్స్ ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీ) కృషి చేయాలని జేసీ మయూర్ అశోక్ అన్నారు. స్థానిక దీక్షా మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎఫ్‌పీసీని శుక్రవారం ఆయన సందర్శించి, రైతులు పండించిన కూరగాయలు, ఆకు కూరలు, చిరుధాన్యాలను పరిశీలించారు. రైతుల వివరాలను దీక్ష సీఈఓ శాంతి వివరించగా.. రైతులకు నాబార్డు అందిస్తున్న సేవలను నాబార్డు డీడీఎం టి. నాగార్జున తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల మురళీకృష్ణ, ఎంపీడీఓ అక్కారావు, దీక్షా మహిళా సిబ్బంది, ధరణి ఎఫ్‌పీసీ సిబ్బంది, అక్షయ రైతు జట్టు డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల తనిఖీ

మండలంలోని గూడెపువలసలో రెవెన్యూ, సర్వేశాఖ సంయుక్తంగా చేపడుతున్న సర్వే సరిహద్దు రాళ్ల ఏర్పాటుపై జేసీ మయూర్ అశోక్ ఆరా తీశారు. తహసీల్దార్ బాల మురళీకృష్ణ, తదితరులతో కలిసి సర్వే రాళ్లను తనిఖీ చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



సూచనలిస్తున్న డీసీసీబీ కౌన్సిలర్ తిరుమలరావు

బొబ్బిలి రూరల్: గ్రామీణ ప్రాంత రైతులు, గ్రామస్తులు బ్యాంకులు అభివృద్ధి చేస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని డీసీసీబీ కౌన్సిలర్ పి. తిరుమలరావు సూచించారు. మండలంలోని కోమటపల్లి, చింతాడ గ్రామాలలో నాబార్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీసీసీబీ డిజిటల్ లిటరసీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తిరుమలరావు మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి చెందుతున్న తరుణంలో రైతులంతా డీసీసీబీ బ్యాంక్ ఖాతాలు తెరవాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు తెరుచుకోవాలని సూచించారు. కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే రైతుల ఇబ్బందికి కారణం

- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది రైతులు ధాన్య విక్రయాల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని సభ్యులు ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సమావేశంలో రైతుల సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని ఏఓ ప్రభాకరరావును కోరారు. అలాగే మండలంలో పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో గౌరవ వేతనం అందడంలేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేయగా, సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎంపీపీ సురేష్‌ముఖర్జీ సూచించారు. జాబ్‌కార్డులు కలిగి ఉన్న 11181 మందికి ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పిస్తున్నట్లు ఏపీఓ సంగంనాయుడు అన్నారు. వెలుగు ఏపీఎం మీసాల చక్రపాణి మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.17.40 కోట్లుతో స్త్రీనిధి రుణాలు మంజూరు చేశామని, మండలానికి ఒక కోల్డ్ స్టోరేజీ మంజూరు అయ్యిందని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న విలేజ్ వెల్‌నెస్ సెంటర్ భవనాలతోపాటు సచివాలయ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేఈ ఆనందరావు అన్నారు. విద్యుత్ సమస్య లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, మండల విప్ తెంటు కుమారి, పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



తాలాడ పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ

సంతకవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన వినూత్నంగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలో బొద్దూరు, గుళ్లసీతారాంపురం, సంతకవిటి జెడ్పీ హైస్కూళ్లతో పాటు వాసుదేవపట్నం కేజీబీవీ పాఠశాల, తాలాడలోని ప్రభుత్వ యూపీ స్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ బి.శాంతికుమారి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బొబ్బిలిలో ఎన్ఆర్ఐ వైద్య సేవలు

- ఆస్పత్రిని ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి ద్వారా బొబ్బిలిలో 24 గంటలూ అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ ఆస్పత్రిని మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజలు అత్యవసర సేవల కోసం ఇబ్బంది పడుతున్న వేల ఎన్ఆర్ఐ ఆస్పత్రి ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ, ఈ ప్రాంత వైద్యాధికారి జనార్దనరావు ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఆస్పత్రి నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, ఎన్ఆర్ఐ అస్పత్రి చైర్‌పర్సన్ చలసాని విజయలక్ష్మి, మేనేజింగ్ డైరెక్టర్లు శైలేష్, జనార్దనరావు, ప్రథమ ఆస్పత్రి ఎం.డి పి.విశ్వేశ్వరరావు, ఎంజీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు సీతారామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్, ఫోన్ నంబర్లు అందజేయాలి

- తహసీల్దార్ డోల రాజేశ్వరరావు



కవిరాయునివలసలో సరిహద్దుల గుర్తించే మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: గ్రామాల్లో జరుగుతున్న వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా సరిహద్దుల గుర్తింపు చేపట్టే సమయంలో సర్వే బృందానికి రైతులు తమ ఆధార్, ఫోన్ నంబర్లు తెలియజేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని కవిరాయునివలసలో జరుగుతున్న సరిహద్దుల గుర్తింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూముల రీసర్వే అనంతరం రైతుల పేరున రానున్న పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్‌లో ఎటువంటి తప్పులు జరగకుండా ఉండేందుకు రైతులు వారి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌ను సర్వే చేస్తున్న అధికారులకు అందజేయాలన్నారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: రోడ్డు విస్తరణలో భాగంగా చేపడుతున్న కాలువ పనులను కమిషనర్ డీటీవీ కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. స్థానిక గాయత్రి కాలనీ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. పనుల నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. పనుల్లో అలసత్వం వహించొద్దని, సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఆయనతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా నేత్రోత్సవం



పసుపు, కుంకుమలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

రాజాం సిటీ: స్థానిక పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి శుక్రవారం ఘనంగా నేత్రోత్సవం చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా పుసుపు, కుంకుమలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. పూజల అనంతరం అమ్మవారి ప్రతిమలను గుడి నుంచి కొండంపేట గ్రామంలో ఉన్న ప్రధాన పూజారి లంకలపల్లి సూర్యనారాయణ ఇంటివద్ద ఉంచనున్నారు. జాతర చివరి రోజు మంగళవారం ఘటోత్సవంలో భాగంగా అమ్మవారి గుడికి వాటిని తిరిగి చేర్చడంతో జాతర ముగుస్తుంది. నేత్రోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అదానీ కుంభకోణంపై దర్యాప్తు చేపట్టాలి

- వామపక్ష నాయకులు



ఆందోళన చేస్తున్న సీపీఐ, సీపీఎం కార్యకర్తలు

బొబ్బిలి: ఇటీవల చోటుచేసుకున్న అదానీ కుంభకోణంపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఆర్థికంగా మేలు చేస్తోందని ఆరోపించారు. అదానీని అన్ని రకాలుగా కేంద్రమే ఆదుకుంటోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, సీపీఎం, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, ఎం.శ్రీనివాస్, కోట అప్పన్న, రవి, సురేష్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

వావిలవలస కుర్రోడికి డాక్టరేట్



వీసీ ప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న వెంకటేష్

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన పాలూరి వెంకటేష్ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో డాక్టర్ కె.వి.రమణమూర్తి గైడెన్స్‌లో 'పెర్‌ఫార్మెన్స్ ఆఫ్ ఎవల్యూషన్ ఆఫ్ మ్యూచివల్ ఫండ్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై సమగ్ర పరిశీలనకు గాను పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు వెంకటేష్ తండ్రి పాలూరి రామకృష్ణ మాస్టారు తెలిపారు. వర్సిటీ వీసీ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా గురువారం డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు చెప్పారు.

సుధాకర్‌ను గెలిపించాలి..

- వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తెర్లాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలోకి దిగిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు మాట్లాడుతూ, సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కష్టపడి పనిచేయాలన్నారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటు సీతంరాజుకు వేసేలా కోరాలన్నారు. సమావేశంలో పలు గ్రామాల పట్టభద్రులు, పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



గ్రామంలోని పెదవీధిలో రోడ్డు పనులు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో సుమారు రూ.10 లక్షలు పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామంలోని పెద వీధిలో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు గ్రావెల్‌తో చదును చేశారు. ఎన్నో ఏళ్లుగా సీసీరోడ్డు నిర్మించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో సీసీ కాలువలు, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో తమ వెతలు తీరాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండుపూటలా పనిచేస్తే గిట్టుబాటు వేతనం



రాజాం సిటీ: వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

సంతకవిటి: ఉపాధి వేతనదారులు రెండుపూటలా పనిచేస్తే గిట్టుబాటు వేతనం వస్తుందని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి అన్నారు. గుళ్లసీతారాంపురం గ్రామంలోని కృష్ణంనాయుడు చెరువులో జరుగుతున్న ఉపాధిపనులు శుక్రవారం పరిశీలించారు. మస్టర్ సీట్లు పరిశీలించి వేతనదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మామిడిపల్లి, తాలాడ, సంతకవిటి తదితర గ్రామాల్లో గ్రామ సచివాలయాలను సందర్శించారు.

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు శుక్రవారం పరిశీలించారు. పని కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వేతనదారులకు ఎలాంటి సమస్య ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు. ఆయనతోపాటు ఏపీఓ ఎస్.హరనాథరావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు. రెండు పూటలా పనులకు హాజరై, ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేస్తే రూ.257లు వేతనం లభిస్తుందన్నారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

బొబ్బిలి: పట్టణంలోని బలిజిపేట రోడ్డు వద్ద పాత పైపులైన్లు తీసి కొత్త పైపులైన్లు వేస్తున్నందున శని,ఆదివారాలలో నీటిసరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

రాజాం సిటీ: స్థానిక నారాయణ పాఠశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి సిర్లి సంబరాలు

బొబ్బిలి రూరల్: పట్టణంలోని యాదవవీధిలో ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు సిర్లి సంబరాలు నిర్వహించనున్నట్లు సిర్లి ఎల్లమ్మ, పోతన్న ఆలయ ఉత్సవ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో భాగంగా ఈనెల 26న ప్రత్యేక పూజలు, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, కుంకుమ పూజలు..27న ఉదయం సిర్లిపోతన్న విగ్రహావిష్కరణ.. 28న అమ్మవారికి బోనాల సమర్పణ, మధ్యాహ్నం అన్నదానం.. మార్చి 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి సిర్లి పోతన్న, ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవం



ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



పూజలు చేస్తున్న డీఎస్పీ, తదితరులు

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఆరు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో లక్ష్మీగణపతి, నవనాగ సహిత బాలసుబ్రహ్మణ్య, కాలభైరవ, చండీశ్వర సహిత కాశీవిశ్వేశ్వర విశాలాక్షి స్పటిక లింగాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.

రేగిడి: మండలంలో కొమెర గ్రామంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న విద్యాగణపతి, జ్ఞాన సరస్వతీ సహిత షిర్డీసాయి మందిర ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మూడురోజుల పాటు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అంపోలు రుద్రకోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్ షిర్డీసాయిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.